సాక్షి ఖమ్మం

గురువారం । 9 । నవంబర్ । 2023

I



'సువిధ'తో సులభంగా..

సువిధ యాప్ ద్వారా ఎన్నికల సంబంధిత అనుమతులను త్వరగా జారీ చేస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. IIలో



డిసెంబర్‌కల్లా పూర్తిచేయండి

అటవీ శాఖ సంబంధిత పనులను త్వరగా పూర్తిచేయాలని టీఎస్‌ఎఫ్‌డీసీ వీసీ, ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. IIలో

గరిష్టం / కనిష్టం
29° / 21°


వాతావరణం

జిల్లా అంతటా గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం దాటాక చలి పెరుగుతుంది.

కలవని చేతులు!

కాంగ్రెస్ టికెట్ దక్కని నేతల తిరుగుబాటు

- ఇప్పటికే పార్టీకి పలువురి రాజీనామా
- రెబల్స్‌గా పోటీలో ఉంటామని ప్రకటన
- నేడు, రేపు నామినేషన్లు వేసేందుకు సమాయత్తం
- మరోపక్క మద్దతు కోసం ముఖ్యనేతలను కలుస్తున్న అభ్యర్థులు



మూడో విడత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రకటన తర్వాత టికెట్ దక్కని ఆశావహుల ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి. తొలినుంచి పార్టీ కోసం కష్టపడిన తమకు టికెట్ దక్కకపోవడంపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యాన కొందరు నేతలు పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరే ప్రయత్నంలో ఉన్నారు. ఇక టికెట్ దక్కించుకున్న అభ్యర్థులు ముఖ్యనేతలను కలుస్తూ మద్దతు కోరుతున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

టికెట్ కోసం పోటాపోటీ

ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తూ అధికసంఖ్యలో ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది నియోజకవర్గాల నుంచి 120 మంది దరఖాస్తు చేసుకోగా.. జిల్లాలోని రిజర్వుడ్ స్థానాలైన సత్తుపల్లి, అశ్వారావుపేట, ఇల్లెందు, వైరా స్థానాల నుంచి పెద్దసంఖ్యలో పోటీ పడ్డారు. ఒక్కో సీటుకు బహుముఖ పోటీ నెలకొనడంతో సర్వేల ఆధారంగా టికెట్లు కేటాయించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. దీంతో టికెట్ల ప్రకటన ఆలస్యం కాగా, ఆశావహులు ఢిల్లీలో మకాం వేశారు. ఆశావహులు ఎక్కువగా ఉన్న చోట పలుమార్లు వడపోత అనంతరం ఈనెల 6న రాత్రి కాంగ్రెస్ ప్రకటించిన మూడో విడత జాబితాలో సత్తుపల్లి, అశ్వారావుపేట, వైరా, ఇల్లెందు నియోజకవర్గాల అభ్యర్థులు ఖరారయ్యారు.

'తాటి'కి టికెట్ దక్కకపోవడంతో..

అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి తాటి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ టికెట్ ఆశిస్తూ విశ్వప్రయత్నాలు చేశారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఆయన పోటీ చేసి ఓడిపోగా, సిట్టింగ్ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఉండడం, తదితర కారణాలతో టికెట్ దక్కదని భావించి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అయితే ఇక్కడ టికెట్ కోసం ఆయనతోపాటు జారె ఆదినారాయణ, ములకలపల్లి జెడ్పీటీసీ తదితరులు పోటీ పడ్డారు. చివరకు టికెట్ జారె ఆదినారాయణకు దక్కడంతో వెంకటేశ్వర్లు రాజీనామా చేయడమేకాక బీఆర్‌ఎస్ నేతలను కలిసి ఈనెల 13న గులాబీ కండువా కప్పుకోనున్నట్లు ప్రకటించారు.

సత్తుపల్లిలోనూ అదేతీరు

సత్తుపల్లిలో కాంగ్రెస్ టికెట్ ఆశించిన పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ కూడా తీవ్ర నిరాశకు గురయ్యారు. ఏళ్ల పాటు పార్టీకి సేవ చేసిన తమలాంటి వారికి ఇలా జరగడం ఏమిటని చెబుతూ... కాంగ్రెస్ తరఫున ప్రచారం చేయనని ప్రకటించారు. మరోవైపు ఇదే స్థానానికి టికెట్ ఆశించిన మానవతారాయ్ ఇప్పటికే పార్టీకి రాజీనామా చేశారు. వీరితో పాటు అనుచరులు కూడా కాంగ్రెస్‌కు బై చెప్పేశారు. ఇల్లెందు టికెట్ ఆశించిన వెంకటప్రవీణ్ నాయక్ రెబల్‌గా నామినేషన్ దాఖలు చేశారు. అంతేకాక కొత్తగూడెం సీటును పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించడంతో అక్కడ టికెట్ ఆశించిన ఎడవల్లి కృష్ణ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మంగళవారం ఆయన అనుచరులతో కలిసి పాల్వంచలో నిరసన తెలపడమేకాక పోటీ చేస్తానని ప్రకటించారు.

ముఖ్యనేతలను కలుస్తూ...

ఇక టికెట్ దక్కించుకున్న అభ్యర్థులు పార్టీలో నేతల మద్దతు కూడకట్టడంలో నిమగ్నమయ్యారు. వైరా అభ్యర్థి మాలోతు రాందాస్‌నాయక్ బుధవారం మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి ఆయనతో పాటు వైరా, జూలూరుపాడు, ఏన్కూరులో జరిగిన చేరికల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే సత్తుపల్లి టికెట్ పొందిన మట్టా రాగమయి, ఆమె భర్త మట్టా దయానంద్‌లు మాజీ మంత్రి తుమ్మల, పొంగులేటిని కలిశారు. సత్తుపల్లిలో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. మిగతా నేతలను, టికెట్ దక్కని ఆశావహులను కూడా కలవడంతో నిమగ్నమయ్యారు. నామినేషన్ల దాఖలుకు రెండు రోజుల సమయమే ఉండటంతో అటు నేతలను సమన్వయం చేసుకుంటూనే ఇటు నామినేషన్ల దాఖలుకు సమాయత్తమవుతున్నారు.

రెబల్స్‌గా పోటీకి సై

కాంగ్రెస్‌లో టికెట్ దక్కని ఆశావహులు రెబల్‌గా పోటీకి సిద్ధమయ్యారు. టీపీసీసీ నేత మానవతారాయ్ పార్టీకి రాజీనామా చేయగా రెబల్‌గా నామినేషన్ వేస్తానని ప్రకటించారు. అలాగే, అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి కూడా అనుచరులతో సమావేశమై నిర్ణయం వెల్లడించారు. సత్తుపల్లి టికెట్ ఆశించిన కొండూరు సుధాకర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట ప్రకారం నడచుకోనున్నట్లు తెలిపారు.

నామినేషన్ల జోరు..

ఖమ్మంలో 24, భద్రాద్రిలో 20

- పాలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాల నామినేషన్ దాఖలు
- కొత్తగూడెంలో సీపీఐ నుంచి కూనంనేని
- నేడు మరింతగా పెరగనున్న సంఖ్య



పాలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్ సమర్పిస్తున్న కందాల ఉపేందర్‌రెడ్డి, పక్కన ఎంపీ నామ, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, కందాల కుమార్తె దీపిక

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బుధవారం మొత్తం 44 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ఖమ్మం జిల్లా నుంచి 24, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 20 నామినేషన్లు అందాయి. ఖమ్మం జిల్లా ఖమ్మం నియోజకవర్గంలో ఆరు నామినేషన్లు దాఖలు కాగా.. కాంగ్రెస్ తరఫున తుమ్మల నాగేశ్వరరావు మూడో సెట్ సమర్పించారు. ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నాలుగు నామినేషన్లు, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి ఒక నామినేషన్ దాఖలైంది. ఇక పాలేరు నుంచి ఆరు నామినేషన్లు పడగా.. అందులో బీఆర్‌ఎస్ నుంచి కందాల ఉపేందర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు, ప్రజావాణి పార్టీ నుంచి ఒకరు, బహుజన సమాజ్ పార్టీ నుంచి ఒకరు ఉన్నారు. అలాగే, మధిర నుంచి నాలుగు నామినేషన్లు దాఖలు కాగా.. అందులో కాంగ్రెస్ పార్టీ నుంచి మల్లు భట్టి విక్రమార్క తరఫున నాయకులు నాయుడు సత్యనారాయణ, సభ్యుడు సూరంశెట్టి నాగభూషణం సమర్పించారు. ఇక్కడ ముగ్గురు స్వతంత్రులు కూడా నామినేషన్లు వేశారు. సత్తుపల్లిలో ఎనిమిది నామినేషన్లు నమోదు కాగా, కాంగ్రెస్ తరఫున మట్టా రాగమయి, సీపీఎం తరఫున మాచర్ల భారతితోపాటు డమ్మీ అభ్యర్థి, స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు, సకల జనుల పార్టీ, పిరమిడ్‌పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఒక్కొక్కరు ఉన్నారు.

భద్రాద్రి కొత్తగూడెంలో ఇరవై...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం 18 మంది అభ్యర్థులు 20 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ఎనిమిది నామినేషన్లు దాఖలు కాగా.. ఇందులో సీపీఐ అభ్యర్థిగా కూనంనేని సాంబశివరావు ఉన్నారు. పినపాకలో ఐదు, అశ్వారావుపేటలో కాంగ్రెస్ నుంచి జారె ఆదినారాయణ సహా నలుగురు, భద్రాచలంలో ముగ్గురు నామినేషన్లు సమర్పించారు.

నేడు భారీగా నమోదు కానున్న నామినేషన్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గురువారం నామినేషన్లు జోరుగా పడనున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున నాయకులు నామినేషన్లు దాఖలు చేయగా.. అభ్యర్థులు నేరుగా సమర్పించనున్నారు. పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీపీఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం, మధిర నుంచి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు భట్టి విక్రమార్క, లింగాల కమల్‌రాజ్, ఖమ్మం సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్, సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య తదితరులు గురువారం నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. కాగా, పాలేరులో కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేయనుండగా, ఉదయం 11గంటలకు ఖమ్మం రూరల్ మండలంలోని నాయుడుపేట జంక్షన్ నుండి కాల్వొడ్డు వరకు భారీ ర్యాలీ ఉంటుందని.. కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు భారీగా హాజరు కావాలని నాయకులు కోరారు.

జంగ్ తెలంగాణ

పెనుతుఫానులా కాంగ్రెస్

- తెలంగాణలో రాబోయేది ఇందిరమ్మ రాజ్యమే
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన ప్రజాప్రతినిధులతో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని.. పెనుతుఫానులా కాంగ్రెస్ దూసుకొచ్చి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని మాజీ ఎంపీ, పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తిరుమలాయపాలెంకు చెందిన పలువురు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీపీ బోడ మంగీలాల్, ఎదుళ్లచెరువు, ఏనెకుంటతండా, మహ్మదాపురం, తాళ్లచెర్వు ఎంపీటీసీలు భూక్యా శాంతిమోహన్, ధరావత్ విజయానంద, చుంచు వెంకటేశ్వర్లు, ఇస్లావత్ భద్ర, సోలిపురం సర్పంచ్ హలావత్ జ్యోతి శ్రీనివాస్‌కు పొంగులేటి కాంగ్రెస్ కండువా కప్పాక మాట్లాడారు. పొద్దు గూకిన తర్వాత ఏ గూటి పక్షులు ఆ గూటికి రావడం ఎంత సహజమో, కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలు కూడా అలాగే చూస్తున్నారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లానే కాకుండా యావత్ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందనడానికి ఇదే నిదర్శమని తెలిపారు.

కేసీఆర్ వ్యాఖ్యలు సరికాదు...

ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం జిల్లాలో వేదికలపై మాట్లాడేటప్పుడు ఆయన వయస్సుకు తగినట్లుగా వ్యవహరించాలని పొంగులేటి హితవు పలికారు. విమర్శ చేసేటప్పుడు ఎవరిపై చేశాం, ఎలాంటి వారో తెలుసుకోవాలన్నారు. తాను గడియారాలు పంచినప్పుడు ఎన్నికలు లేవనే విషయం తెలియకుండా మాట్లాడడం గర్హనీయమని పేర్కొన్నారు. కాగా, బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న కొందరు పోలీస్ అధికారులు ప్రతిఫలం అనుభవించాల్సి వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, తిరుమలాయపాలెం జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, చావా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించిన రిటైర్డ్ హెచ్‌ఎం



రిటైర్డ్ హెచ్‌ఎం మోయాస్‌తో హెచ్‌ఎం ప్రేమలత, విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం పాండురంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు 70మంది పరీక్ష ఫీజును రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కురువాటి మోయాస్ చెల్లించారు. ఒక్కో విద్యార్థికి రూ.125 చొప్పున 70మంది విద్యార్థుల ఫీజు రూ.8,750 ఆయన బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మోయాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉండడమే కాక నాణ్యమైన విద్య అందుతున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంతో పోలిస్తే పాఠశాలల్లో అన్ని వసతులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

22న జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం మధురానగర్‌లోని విన్‌ఫీల్డ్ స్కూల్‌లో ఈనెల 22న జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. జిల్లాలోని అన్ని యజమాన్య పాఠశాలలకు చెందిన 6నుంచి పదో తరగతి విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవటం ప్రధాన అంశాలుగా ప్రాజెక్టులు ప్రదర్శించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక్కో ప్రాజెక్ట్ వెంట ఇద్దరు విద్యార్థులు పాల్గొనవచ్చని, ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యేలా హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్(94404 50141)ను సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి



జీపీలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ హరికిషన్

కామేపల్లి: గ్రామపంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లపై ఉద్యోగులు దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్ సూచించారు. కామేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించారు. ఆతర్వాత సిబ్బందితో సమావేశమైన డీపీఓ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల్లో శ్రద్ధ కనబరుస్తూనే వంద శాతం పన్నులు వసూలు చేయాలని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి తదితరులుపాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలో సముచిత స్థానం

- కేంద్ర మంత్రులకు లేని గుర్తింపు ఎంపీ నామకు వచ్చింది..
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



సంఘం నేతను సన్మానిస్తున్న మంత్రి పువ్వాడ, ఎంపీ నామ, ఎమ్మెల్సీ మధు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వంలో కమ్మ వారికి సముచిత స్థానం దక్కిందని, కేంద్ర మంత్రులుగా చేసిన వారికి కూడా రాని గుర్తింపు ఎంపీ నామ నాగేశ్వరరావుకు ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో బుధవారం కమ్మ సంఘం ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో పువ్వాడ మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నుండి కోనేరు నాగేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేశారని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక ఈ సామాజిక వర్గం నుండి అనేక మందికి చైర్మన్ పదవులు వచ్చాయని వెల్లడించారు. నియోజకవర్గ వాసులు అన్ని విషయాలు ఆలోచించి మరోమారు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధు, విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, కమ్మ సంఘం ప్రతినిధులు, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ న్యాయసేవల దినోత్సవం

ఖమ్మంలీగల్: అందరికీ న్యాయం, నిరుపేదలకు ఉచిత న్యాయసేవలు అందేలా కేంద్రప్రభుత్వం 1987లో న్యాయసేవల అధికార సంస్థల చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టం 1995 నవంబర్ 9 నుంచి అమల్లోకి రాగా, ఏటా ఇదేరోజు న్యాయసేవల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నూతన్‌కల్‌లోని పాఠశాలలో జరిగే సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించనున్నారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

ఖమ్మంవ్యవసాయం: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కేంద్రాల్లోనే రైతులు పత్తి విక్రయించుకోవాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం ఒక ప్రకటనలో సూచించారు. సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించిన రైతులకు మూడు రోజుల్లో నగదు జమ అవుతోందని పేర్కొన్నారు. అంతేకాక మద్దతు ధర లభిస్తుందని, ఎలాంటి అదనపు భారం పడదని తెలిపారు.

తొలగిన అడ్డంకి..



బారికేడ్లు తొలగించడంతో కనిపిస్తున్న పెయింటింగ్‌లు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మం నగరంలో ఓటు హక్కు నమోదుతోపాటు వినియోగం ఆవశ్యకతను వివరిస్తూ వేసిన వాల్ పెయింటింగ్‌కు బారికేడ్లు అడ్డంగా పెట్టడంతో కనిపించని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయమై 'సాక్షి'లో బుధవారం 'ఇలా ఉంటే అవగాహన ఎలా' శీర్షికతో ఫొటోస్టోరీ ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు వాల్‌పెయింటింగ్‌కు అడ్డుగా ఉన్న బారికేడ్లను తొలగించారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్

స్వేచ్ఛగా ఓటు వేయండి..

ఖమ్మంసహకారనగర్: ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ హెల్ప్‌లైన్, సీ–విజిల్ యాప్‌పై అవగాహన కల్పించగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాల నిర్వాహకులు ఓటు వేయాల్సిన ఆవశ్యకతపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అంతేకాకుండా ధాన్యం అమ్మడానికి వచ్చే రైతులకు పోలింగ్ కేంద్రాల వివరాలు వెల్లడించి ఓటు వేసేలా చూడాలని సూచించారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనంతరం యాప్ డౌన్‌లోడ్, ఫిర్యాదు చేయాల్సిన విధానంపై మాస్టర్ ట్రెయినీ మదన్‌గోపాల్ అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, జిల్లా సహకార అధికారి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేయూ జట్టుకు ఎంపిక



కేయూ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ పరిధి పురుషుల కబడ్డీ జట్టుకు ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఆజాద్, అఖిల్, అనిల్, గాంధీ ఉండగా, కాకినాడలోని జేఎన్‌టీయూలో జరిగే సౌత్ జోన్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ జకీరుల్లా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, పీడీ డాక్టర్ బి.వెంకన్న అభినందించారు.

వెంకటనర్సింహాచారికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వెంకట నర్సింహాచారి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంకు చెందిన రిటైర్డ్ హెచ్ఎం చిట్టోజు వెంకట నర్సింహాచారికి జ్యోతిష్య శాస్త్రంలో గౌరవ డాక్టరేట్ లభించింది. ఢిల్లీలోని ఫరీదాబాద్ మ్యాజిక్ అండ్ ఆర్ట్ యూనివర్సిటీ ప్రతినిధులు బుధవారం ఆయనకు పట్టా ప్రదానం చేశారు. ఇరవై ఏళ్లుగా వెంకట నర్సింహాచారి జ్యోతిష్య, వాస్తులో చేస్తున్న సేవలకు గాను డాక్టరేట్ అందజేయగా, పలువురు అభినందించారు.

డిసెంబర్ కల్లా పనులు పూర్తి చేయండి



పనులను పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు

సత్తుపల్లిటౌన్: అటవీ అభివృద్ధి కార్పొరేషన్ క్వార్టర్లు, కార్యాలయ భవనాలను డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని టీఎస్ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. సత్తుపల్లిలో రూ.1.49 కోట్లతో నిర్మిస్తున్న డివిజనల్ మేనేజర్ కార్యాలయం, ప్లాంటేషన్ మేనేజర్ క్వార్టర్ల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పాల్వంచ, కొత్తగూడెంల లో నిర్మిస్తున్న క్వార్టర్లు, కార్యాలయ భవన నిర్మాణ పనులను కూడా పరిశీలించినట్లు తెలిపారు. ఆ తర్వాత జామాయిల్ ప్లాంటేషన్‌ను సందర్శించిన చంద్రశేఖర్‌రెడ్డి కాంప్లెక్స్ ఏరియా నిర్వహణపై సూచనలు చేశారు. కొత్తగూడెం, సత్తుపల్లి, పాల్వంచ డివిజనల్ మేనేజర్లు చంద్రమోహన్, పి.గణేశ్, తనూజ, ప్లాంటేషన్ మేనేజర్లు బి.సైదానాయక్, ఎస్.నాగరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

'సువిధ'తో సులభంగా అనుమతులు

పార్టీ ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఎఫ్ఓ సిద్ధార్థ్

ఖమ్మంసహకారనగర్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అన్ని రకాల అనుమతులను సువిధ యాప్ ద్వారా జారీ చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు సువిధ ద్వారా 424 అనుమతులు ఇచ్చామని చెప్పారు. కాగా, కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీలోగా పరిష్కరిస్తామన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల పేర్లు తప్పుగా పడినందున మార్పు చేయనున్నామని, ఇందులోనూ అభ్యంతరాలు ఉంటే తెలపాలని చెప్పారు. ఖమ్మం నియోజకవర్గంలో పాండురంగాపురం, ఖానాపురం, కొత్తూరు, పాలేరులో పెద్దతండా, బోధ్యతండా, నాయకన్‌గూడెం, వైరా నియోజకవర్గంలో సామ్యాతండా, లావుడ్యాతండా, వెంకట్యాతండా, చింతలతండా, మధిర నియోజకవర్గంలో మత్కేపల్లి, పండిళ్లపల్లి, రామకృష్ణాపురం, ఆళ్లపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల పేర్లు మారనున్నాయని వెల్లడించారు.

దరఖాస్తులన్నీ 10లోగా పరిష్కారం

కొత్తగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి దరఖాస్తులన్నీ ఈ నెల 10లోగా పరిష్కరించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్షించి సూచనలు చేశారు. వచ్చిన దరఖాస్తులన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అలాగే, పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్య తేలేనాటికి కావాల్సిన బ్యాలెట్ యూనిట్ల సంఖ్యపై ప్రతిపాదనలు సమర్పించాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, కలెక్టరేట్ ఏఓ అరుణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్లు రాంబాబు, మదన్‌గోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు జీపీఎస్, సీసీ కెమెరాలు



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన ఎన్నికల సంఘం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో ఈసారి అడుగు ముందుకేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తోంది. జిల్లాలోని నియోజకవర్గాల్లో అక్రమాలను అరికట్టేందుకు మూడు షిఫ్ట్‌ల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ)లు పర్యవేక్షిస్తున్నాయి. వీరికి కేటాయించిన వాహనాలకు ముందుగానే జీపీఎస్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. తద్వారా వాహనాలు ఏ మార్గంలో వెళ్తున్నాయి, ఎక్కడ ఎక్కువ సేపు ఆగాయనేది ఉన్నతాధికారులు తెలుసుకునే వీలు కలిగింది. ఇప్పుడు అదే వాహనాల పైభాగంలో 360 డిగ్రీల సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. తద్వారా ప్రతీ దృశ్యం రికార్డు అవుతుండగా... కంట్రోల్ రూమ్‌కు పుటేజీని అనుసంధానం చేశారు. దీంతో తనిఖీల సమయంలో అక్రమాలు జరగకుండా.. నగదుతో వెళ్తూ పట్టుబడిన తప్పించుకోకుండా ఈ కెమెరాలు ఉపయోగపడుతున్నాయి.

– ఖమ్మం సహకారనగర్

ఖమ్మం అభివృద్ధి ఘనత నాదే...

- అన్నివర్గాలు ఆత్మగౌరవంతో బ్రతికేలా పనిచేస్తా
- ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: గంజాయి, గుట్కా, డ్రగ్స్ ఫ్రీ నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దడమే కాక అన్ని వర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో బతికేలా పనిచేస్తానని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని పలు డివిజన్లలో బుధవారం జరిగిన రోడ్ షోలు, ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన మాట్లాడారు. ఖమ్మం అభివృద్ధి తన హయాంలోనే జరిగిందని.. తన తర్వాత జరిగిన పనులేవి లేవని చెప్పారు. 2009లో ఖమ్మం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాగునీటి సమస్య పరిష్కారానికి సీఎంలు రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో పుట్టకోట, లకారం, దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్లు నిర్మించామని తెలిపారు. అలాగే, లకారం చెరువు ఆధునికీకరణ, వెలుగుమట్లలో అర్బన్ పార్కు ఏర్పాటు చేశానని వెల్లడించారు. భూకబ్జాలు జరగకుండా, పోలీసుల బెదిరింపులు, రౌడీషీటర్ల ఆగడాలు లేని ప్రశాంతమైన ఖమ్మం కోసం తనను గెలిపించాలని తుమ్మల కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. ఈసమావేశాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు అమర్తహన్ బేగ్, బాలసాని లక్ష్మీనారాయణ, జావీద్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, మలీదు వెంకటేశ్వర్లు, మానుకొండ రాధాకిషోర్, మందడపు నాగేశ్వరరావు, పోట్ల శశికళ, వీరేందర్, సీపీఐ నాయకుడు బండి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రూ.2.10 లక్షల నగదు సీజ్

సత్తుపల్లిరూరల్: తెలంగాణ – ఏపీ సరిహద్దుల్లో బుధవారం చేపట్టిన వాహన తనిఖీల్లో పోలీసులు రూ.2,10,640 నగదు సీజ్ చేశారు. ఓ వ్యక్తి వద్ద రూ.1,10,640, ఇంకొకరి వద్ద రూ.లక్ష నగదు లభించగా, సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని ఎస్ఐ కుశకుమార్ తెలిపారు.

రూ.6వేల విలువైన మద్యం స్వాధీనం

కామేపల్లి: మండలంలోని మద్దులపల్లికి చెందిన షేక్ మహిబ్‌కు చెందిన బెల్ట్ షాపులో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా రూ.6 వేలు విలువైన 33 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థిపై కేసు

ఖమ్మంక్రైం: నామినేషన్ సందర్భంగా రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి లేకుండా బుధవారం ర్యాలీ నిర్వహించిన ఖమ్మం నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి గుర్రం సత్యనారాయణపై ఖమ్మం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ర్యాలీ నిర్వహించడమే కాక డీజే వినియోగించినట్లు తేలడంతో కేసు నమోదు చేశామని సీఐ కుమారస్వామి తెలిపారు.

నాకు అందరూ సమానమే !



జంగ్ తెలంగాణ

పక్షుల నుంచి పంటలను కాపాడుకునేందుకు దిష్టిబొమ్మలు, జెండాలను రైతులు ఏర్పాటుచేయడం మనకు తెలిసిందే! ఇప్పుడు ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుండడంతో వివిధ పార్టీల నాయకులు ఎక్కడపడితే అక్కడ జెండాలను కడుతున్నారు. దీంతో ఇల్లెందు మండలం పోచారంతండా గ్రామానికి చెందిన రైతు వినూత్నంగా ఆలోచించాడు. గ్రామంలో ఎగురుతున్న పార్టీల జెండాలను తన మిర్చి చేనులో ఏర్పాటుచేశాడు. ఏదో ఒక పార్టీ జెండా ఏర్పాటుచేస్తే ఆ పార్టీ అనుచరుడిగా ముద్ర వేస్తారని అనుకున్నాడో ఏమో కానీ అందరూ సమానమేనని చాటేలా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ సహా ప్రజాపంథా పార్టీ జెండాలను కూడా ఏర్పాటు చేయడం ఆకట్టుకుంటోంది.

– ఇల్లెందురూరల్

తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే..

పార్టీ జాతీయ కార్యదర్శి సునీల్‌దియోదర్



మాట్లాడుతున్న సునీల్ దియోదర్, పక్కన నాయకులు

సత్తుపల్లి: తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌చార్జ్ సునీల్ దియోదర్ ధీమా వ్యక్తం చేశారు. సత్తుపల్లిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది పరిస్థితులు బీజేపీకి అనుకూలంగా మారుతున్నాయని, బీసీ సీఎం నినాదంతో ఆ వర్గాల వారందరూ బీజేపీకి ఓటు వేయనున్నారని చెప్పారు. మరోపక్క మంద కృష్ణమాదిగ ఆధ్వర్యాన ఎస్సీ కమ్యూనిటీ ఓట్లు కూడా తమకే పడతాయని తెలిపారు. ఇదే సమయాన సత్తుపల్లి నియోజకవర్గంలోనూ బీజేపీ అభ్యర్థి గెలుస్తారని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గానికి త్వరలో ప్యాసింజర్ రైలు వస్తుందని సునీల్ తెలిపారు. సమావేశంలో బీజేపీ అభ్యర్థి నంబూరు రామలింగేశ్వరరావు, నాయకులు నాయుడు రాఘవరావు, సుదర్శన్ మిశ్రా, భాస్కర్ల వీరంరాజు పాల్గొన్నారు.

హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ షురూ

ఎర్రుపాలెం: కేంద్ర ప్రభుత్వ పరిధిలోని హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ బుధవారం ఎర్రుపాలెంలోని సెయింట్ విన్సెంట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ప్రారంభమైంది. ఈ శిక్షణను హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ కోట రాకేశ్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణ, మానసిక, శారీరక దృఢత్వం పెంపొందించేందుకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న వారికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జానెట్, మాస్టర్ కె.రమేశ్, పీఈటీ రవి తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలకు ఎంపిక

రఘునాథపాలెం: రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు మండలంలోని కోయచలక పాఠశాల విద్యార్థులు పది మంది ఎంపికయ్యారని హెచ్ఎం శిరీష తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో వివిధ విభాగాల నుంచి ఎం.నవ్య, ఎస్‌కే కాసింది, కె.నందిని, ఎం.నక్షత్ర, టి.భవాని, విజయ్‌కుమారి, సాత్విక, టి.స్వాతి, ఎం.రూప, త్రినాథ్ ఎంపికైనట్లు చెప్పారు. వారిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

సీబీఎస్ఈ ఆర్చరీ పోటీల్లో హవా

ఖమ్మంస్పోర్ట్స్: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన ఆల్ ఇండియా సీబీఎస్ఈ ఆర్చరీ పోటీల్లో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో హస్నాషేక్, అనురాధ పతకాలు సాధించగా డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ నగేశ్ బుధవారం అభినందించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి పాఠశాలల క్రీడాజట్లు ఎంపిక



ఉమ్మడి జిల్లాస్థాయి బాలికల ఫుట్‌బాల్ జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి పాఠశాలల అండర్–14, 17 బాలబాలికల ఫుట్‌బాల్, త్రోబాల్ జట్లను బుధవారం ఎంపిక చేశారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీలను డీఈఓ సోమశేఖరశర్మ పర్యవేక్షించగా, రెండు జిల్లాల నుంచి 470 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిక పోటీల నిర్వహణలో జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శి కె.నరసింహమూర్తి, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్‌తోపాటు గంగాప్రసాద్, ఇర్ఫాన్, బి.జనక్‌సింగ్, జి.సైదేశ్వరరావు, వీరరాఘవయ్య, బిక్కెం, రోజా, శివకృష్ణ పాలుపంచుకున్నారు. కాగా, అండర్–17 ఫుట్‌బాల్ బాలికల జట్టుకు అంజలి, కిరణ్మయి, చైత్ర, యువవర్షిణి, నందిని, నక్షత్ర, యామిని, నవ్య, సృజన, కరీంబీ, సింధు, భవానీ, అస్మిత, పావని, గంగోత్రి, కావ్య, శ్రీవల్లి, యామిని ఎంపికయ్యారు. అలాగే, అండర్–14 ఫుట్‌బాల్ జట్టుకు ఎం.యశ్విత, హర్షశ్రీ, భావన, పావని, యమునా, ఉదయశ్రీ, అనూష, లావణ్య, స్వాతి, త్రివేణి, వినీత, కీర్తన, రీతు, చరిత, శరణ్య, రమ్యశ్రీ, దుర్గశ్రీ, జయశ్రీ.., బాలుర విభాగంలో ప్రసన్న, అక్షసాయి దీక్షిత్, యశ్వంత్, సుభాష్, సాయి మణికంఠ, భువన, అఖిల్, ఆదిత్య, చెన్నకేశవ, సంతోష్, తరుణ్, గోపి, తరుణ్, శ్రీనాథ్, ప్రణయ్, శ్యాం, లింగస్వామి ఎంపికైనట్లు తెలిపారు. ఇక అండర్–17 త్రోబాల్ బాలికల జట్టుకు అశ్విని, బిందు, వర్షిత, కీర్తన, శైలజ, శ్రీజ, వైష్ణవి, మహేశ్వరి, రిషిత, సుకన్య, రూప, కమలిక, అంజలి.., బాలుర జట్టుకు మల్లేశ్, జస్వంత్‌రెడ్డి, దినేశ్‌కుమార్, గౌతమ్, భార్గవ్, దినేశ్, శశాంక్, రుత్విక్, ఉపేంద్ర, సాయిశ్రీ వర్ధన్, నవదీప్, సందీప్, దుర్గాప్రసాద్, వివేక్, మాత్విక్, ఉమేశ్ ఎంపికయ్యారని వెల్లడించారు.

ఏపీలో డిప్యూటీ కలెక్టర్‌గా వేంసూరు వాసి



మోహన్‌రావును అభినందిస్తున్న ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

వేంసూరు: కృషి, పట్టుదలతో శ్రమిస్తే విజయం దక్కుతుందని నిరూపించారు వేంసూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన తాతా మోహన్‌రావు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–2 సర్వీస్‌కు ఎంపికై గుంటూరు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తుండగా డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి లభించింది. వేంసూరులో పదో తరగతి వరకు చదివిన మోహన్‌రావు, ఇంటర్, డిగ్రీ సత్తుపల్లిలో పూర్తిచేశాక కేయూ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. మొదటి నుంచి చదువుపై శ్రద్ధ కనబరిచే ఆయన డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందగా.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. అలాగే, గ్రామానికి చెందిన నాయుడు రాఘవరావు, పర్సా రాంబాబు, భాస్కర్ల వీరంరావు, చీపు పుల్లారావు, సుధాకర్, వెంకటేశ్వరరావు, జోగారావు, కంటే శేఖర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సత్తుపల్లిటౌన్: మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. సత్తుపల్లిలోని గీతమ్స్ కళాశాల రోడ్డులో నివాసముంటున్న తాళ్లూరి నాగమణి బుధవారం బ్యాంక్‌కు వెళ్లివస్తోంది. ఆమె వెనుక బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మెడలోని నాలుగు కాసుల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టినట్లు సత్తుపల్లి సీఐ మోహన్‌బాబు తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి వరిగడ్డి దగ్ధం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన పువ్వాళ్ల ప్రసాద్ బుధవారం ట్రాక్టర్ ట్రక్కుపై 110 వరిగడ్డి కట్టలు వేసుకుని వస్తున్నాడు. ఈ క్రమంలో పొలంలోని విద్యుత్ వైర్లు తాకగా షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు అంటుకోగా గడ్డి కాలిపోవడంతో రూ.15 వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

హైకోర్టు ఆదేశాలతో నమోదు చేసిన పోలీసులు


కామేపల్లి: మండలంలోని పింజరమడుగుకు చెందిన ముగ్గురిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. గ్రామంలోని బాలాంజనేయస్వామి దేవాలయం ఎదురుగా సెప్టెంబర్ 22న మహిళలు బతుకమ్మ ఆడుతుండగా పింజరమడుగు తండాకు చెందిన గుగులోత్ బాషా అక్కడ ఉన్నాడు. అక్కడకు వచ్చిన గుజ్జర్లపూడి సతీశ్, రాంమూర్తి, సత్యనారాయణ ఆయనను దూషించారు. దీంతో అక్టోబర్ 7న ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. ఈ మేరకు బాషా హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు ఆదేశాలతో ముగ్గురిపై మంగళవారం రాత్రి అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

కుమార్తెను చూడకుండానే..

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం శివారు సింహాద్రినగర్–2 వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరశెట్టి రాంబాయి (42) మృతి చెందగా ఆమె భర్త రాంబాబుకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురానికి చెందిన రాంబాబు తన భార్య రాంబాయితో కలిసి ఖమ్మంలో చదువుతున్న కూతురును చూడటానికి బుధవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో సింహాద్రినగర్–2 వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో వీరిద్దరు రోడ్డుపై పడిపోయారు. లారీ ముందు చక్రాలు రాంబాయి నడుము పైనుంచి వెళ్లడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఇదే ఘటనలో రాంబాబు కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. మృతురాలు అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే, రాంబాబు ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్ శ్రీశైలంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.


విధులకు వెళ్తుండగా గుండెపోటుతో కానిస్టేబుల్..



ప్రసాద్ (ఫైల్)

ఖమ్మంక్రైం: ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న ఓ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందాడు. ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ బండెల ప్రసాద్ (48) ప్రస్తుతం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌లో ఉన్నాడు. ఆయన బుధవారం మధ్యాహ్నం కవిరాజ్‌నగర్‌లోని ఇంటికి వచ్చి మళ్లీ బయలుదేరుతుండగా గుండెపోటుతో కుప్పకూలాడు. స్థానికులు ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, ప్రసాద్ 1995లో ఏఆర్ నుంచి సివిల్ విభాగానికి వచ్చాడు. ఆయనకు భార్య సునీత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన స్వస్థలం భద్రాచలానికి మృతదేహాన్ని తరలించగా, ఏసీపీ హరికృష్ణ, సీఐలు సత్యనారాయణ, కుమారస్వామితో పాటు సిబ్బంది నివాళులర్పించారు.

రోజు వ్యవధిలో అక్కాచెల్లెళ్లు..



బొమ్మ బూబు, కోడి కళమ్మ (ఫైల్)

తిరుమలాయపాలెం: కలిసిమెలిసి ఉండే అక్కాచెల్లెళ్లు మరణంలోనూ కలిసే పయనించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అక్క మృతి చెందగా, తల్లడిల్లిపోయిన చెల్లెలు గుండెపోటుతో కన్నుమూసింది. తిరుమలాయపాలెం మండలంలోని ఎద్దుళ్లచెరువుకు చెందిన అక్కాచెల్లెళ్లు బొమ్మ బూబు(74)తో పాటు కోడి కళమ్మ (55)కు ఇదే గ్రామవాసులతో వివాహం జరగడంతో ఇక్కడే నివాసముంటున్నారు. ఒకరికొకరు ఏ కష్టం వచ్చినా పాలుపంచుకునేవారు. ఈ క్రమంలో నాలుగు నెలల కిందట బూబు బ్రెయిన్‌స్ట్రోక్‌కి గురై సోమవారం రాత్రి మృతి చెందింది. దీంతో అంత్యక్రియల్లో పాల్గొన్న కళమ్మ మంగళవారం రాత్రి ఇంట్లో గుండెపోటుతో మరణించింది. రోజు వ్యవధిలో అక్కా చెల్లెళ్లు మృతిచెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విద్యుత్ సరఫరా లేక అందని ఆక్సిజన్



ఉమామహేశ్వరరావు (ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఆకుతోట ఉమామహేశ్వరరావు (48) మంగళవారం రాత్రి బైక్‌పై మోటాపురం నుంచి రాజేశ్వరపురం వస్తున్నాడు. అదేసమయాన గ్రామం నుంచి బైక్‌పై వచ్చిన యువకులు ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉమామహేశ్వరరావును నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా విద్యుత్ సరఫరా లేక ఆక్సిజన్ అందించలేకపోయారు. దీంతో అక్కడి నుంచి ఖమ్మంకు, ఆ తర్వాత బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న రైతు...

కూసుమంచి: మండలంలోని లోక్యాతండాకు చెందిన రైతు వడిత్యా రాంచంద్రు (45) చేనుకు పురుగులమందు కొడుతుండగా అస్వస్థతకు గురై, చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. గత నెల 21న రైతు రాంచంద్రు తాను కౌలుకు తీసుకున్న చేనులో పురుగుల మందు కొడుతుండగా మందు ప్రభావంతో స్పృహకోల్పోయాడు. సమీప రైతులు, కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఆయన మృతి చెందాడని పోలీసులు తెలిపారు.



ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు. పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా ఇటీవల మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది. కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో దేదీప్యమానంగా వెలిగిపోవాలి. అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి, కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు.. వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి? భేష్ అనదగిన విధానాలేమిటి? అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మానాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్పనక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ-బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మొటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మొటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10–15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు. దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?



దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి. ● నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్టు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది. ● వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తినడానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి ● నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు ● నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు ● ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వాలికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి



● ఫౌజియా

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు. ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో. పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో'పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు. ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.


డానిష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



మహాభారతం కథల నుంచి స్వాతంత్య్రం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.